www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 31 డిసెంబర్ 2025
5
ఏలూరు

భవిత కేంద్రాన్ని వినియోగించుకోవాలి

ఎంఇఒ-1 సురేష్

ప్రజాశక్తి - మండవల్లి

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత ఒక వరమని విద్యాశాఖ అధికారి-1 సురేష్ అన్నారు. మండలంలోని లోకుమూడి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న భవిత స్పెషల్ స్కూల్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను క్రమం తప్పకుండా భవిత పాఠశాలకు పంపిస్తే వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారన్నారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేందుకు కావలసిన ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తానని ఆయన తెలిపారు. అనంతరం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ కె.సునీత, అరుణకుమారి, వై.శిరీష, శైలజ పాల్గొన్నారు.

అంతా నా ఇష్టం..!

మత్స్యశాఖలో ఇష్టారాజ్యం
నిడమర్రు ఎఫ్‌డిఒ రవికుమార్ అడ్డగోలు వ్యవహారం
వివాదాస్పద భూముల్లో చేపల చెరువులకు అనుమతి
పిజిఆర్ఎస్ ఫిర్యాదు పరిష్కారం కాకుండానే ముందుకు
33 ఎకరాల చేపల చెరువులో మ్యూటేషన్ కాని, నోషనల్ ఖాతాల భూములు
ఎఫ్‌డిఒ వ్యవహార శైలిపై ఇప్పటికే విచారణ పూర్తి
తప్పు చేసినట్లు నిర్ధారణ,చర్యలు తీసుకునేలోపు అడ్డగోలు వ్యవహారాలు

వివాదాస్పద చెరువులో పంట బోదె ఉన్నట్లు నిర్ధారించి బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మత్స్యశాఖలో కొంతమంది అధికారుల బరితెగింపు వ్యవహారం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువులకు అనుమతులు ఇస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. నిడమర్రు మండల మత్స్య శాఖాధికారి పివి.రవికుమార్ వ్యవహరిస్తున్న తీరు ఆ శాఖ ప్రతిష్టను మరింత దిగజారుస్తున్న పరిస్థితి ఉంది. కొంతమందికి వత్తాసు పలుకుతూ సాఫీగా సాగుతున్న చేపల చెరువులకు నిబంధనలకు విరుద్ధంగా నోటీసులు జారీ చేసి వివాదాలు సృష్టించడంతోపాటు, నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువులకు అనుమతులు మంజూరు చేసేందుకు పూనుకుంటున్న తీరు సదరు అధికారి బరితెగింపుకు నిదర్శనమనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికే ఎఫ్‌డిఒ వ్యవహార శైలిపై మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాలతో జిల్లా అధికారులు విచారణ చేయడం, ఎఫ్‌డిఒ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు తేల్చడం సైతం జరిగింది. ఎఫ్‌డిఒపై చర్యలు తీసుకోవడంలో ఆలస్యంతో సదరు అధికారి మరింత రెచ్చిపోయి వ్యవహరిస్తున్న పరిస్థితి. నిడమర్రు మండలం అడవికొలను రెవెన్యూ పరిధిలోని తిమ్మారావుగూడెంలో 148 నుండి 163 సర్వే నెంబర్లలో దాదాపు 70 ఎకరాల చేపల చెరువు ఉంది. ఆ చెరువులోని 159-4 సర్వే నెంబర్‌లో పంట బోదెకు సంబంధించిన 94 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఇటీవల దీనిపై సాగునీటి హక్కు గల రైతుల ఫిర్యాదుతో అధికారులు చర్యలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు పంట బోదెను విడదీయడం సైతం జరిగింది. ఇప్పుడు పంట బోదెకు ఆనుకుని ఉన్న 148 నుంచి 154, 160 సర్వే నెంబర్లలో 33 ఎకరాల చేపల చెరువు ఏర్పాటుకు మత్స్యశాఖ అధికారులకు దరఖాస్తు అందింది. ఈ చెరువు 40 ఎకరాల వరకూ ఉంటుందని, ఆ భూముల్లో 153-1, 153-2 సర్వే నెంబర్లలో నోషనల్ ఖాతాల భూములు ఉన్నాయని పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదులు సైతం అందాయి. అంతేకాకుండా మ్యూటేషన్ కాని భూములు ఐదెకరాలకుపైగా ఉన్నాయి. ఈ భూములకు సంబంధించి ఎటువంటి దరఖాస్తులూ లేవు. దీంతో సదరు దరఖాస్తును కొద్దిరోజుల క్రితం కింది నుంచి పైవరకూ ఉన్న మత్స్యశాఖాధికారులంతా తిరస్కరించారు. తిరస్కరణకు కారణాలు సైతం వెల్లడించారు. ఈ చెరువుపై పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు పెండింగ్‌లో ఉందని, ఈ చెరువు పరిధిలో ఇరిగేషన్ కెనాల్ వివాదం ఉందని, సరైన ఆటోక్యాడ్ మ్యాప్ లేదని, ప్రతిపాదిత చేపల చెరువు గట్టు విడదీయలేదని పేర్కొంటూ తిరస్కరించారు. అదే చెరువు దరఖాస్తును మరోసారి రీఓపెన్ చేయగా మండలాధికారిగా ఉన్న ఎఫ్‌డిఒ రవికుమార్ అనుమతి ఇస్తున్నట్లు అప్రూవల్ ఇవ్వడం వివాదాస్పదంగా మారింది.

నివేదికలు కాలరాసి.. చేపల చెరువుకు అప్రూవల్

రెవెన్యూ, పంచాయతీ ఏశాఖలోనైనా గ్రామస్థాయిలోని అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు ముందుకు సాగుతారు. రెవెన్యూలో విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి ఇలా గ్రామస్థాయిలో అధికారుల నివేదికే కీలకం. ఏదైనా సమస్య వస్తే కిందిస్థాయి అధికారులపైనే సస్పెన్షన్ వంటి చర్యలు ఉంటాయి. కొయ్యలగూడెం మండలంలోని పరింపూడిలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ ప్రక్రియలో జరిగిన అవకతవకల్లో విఆర్ఒను సస్పెండ్ చేశారు. తిమ్మారావుగూడెం చేపల చెరువు విషయంలో సచివాలయ ఫిషరీస్ అధికారి నిబంధనలు సరిగా లేవంటూ రిజెక్ట్ చేయగా, మండలాధికారి ఎఫ్‌డిఒ అప్రూవల్ ఇవ్వడం చూస్తే సదరు అధికారి అడ్డగోలు వ్యవహారం గురించి వేరే చెప్పనక్కర్లేదు. మ్యూటేషన్ చేయని భూములు ఉన్నాయని తెలుసు, నోషనల్ ఖాతాలు ఉన్నాయని తెలుసు. అయినా ఎఫ్‌డిఒ అప్రూవల్ చేశారంటే ఏం జరిగి ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తప్పు చేసిన సదరు అధికారిపై చర్యలు తీసుకోకుండా మత్స్యశాఖ అధికారులు వ్యవహరిస్తున్న ఉదాశీనతే ఇందుకు ప్రధాన కారణంగా చెప్పొచ్చు. జిల్లా మత్స్య శాఖాధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే సంబంధిత ఎఫ్‌డిఒపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు. ఇంత నిస్సిగ్గుగా నిబంధనలకు వ్యతిరేకంగా ఒక అధికారి వ్యవహరించడం తాము ఎన్నడూ చూడలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొనసాగిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన

సమస్య పరిష్కారంలో అధికారుల అలసత్వం

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు

నూజివీడు టౌన్: ప్రతిష్టాత్మక ఐఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీల్లో చదువుకుని ఆర్‌జియుకెటిలో 2010-14 మధ్య చేరిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు జీతాల పెంపుదల విషయంలో విశ్వవిద్యాలయ అధికారుల ధోరణిని నిరసిస్తూ గత 5 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న సంగతి విధితమే. గత ప్రభుత్వ హయాంలో ఛాన్సలర్ కెసి రెడ్డి తనను తాను రాజుగా ఊహించుకుని అధ్యాపకుల్ని కాలుకింద తొక్కిపెట్టి రాజకీయం చేశారు. జీతం పెంచమని అడిగిన ప్రతీసారి పిట్ట కథలు చెప్పి 7 సంవత్సరాలుగా అనేక సార్లు మోసం చేశారు. ప్రస్తుత ప్రజాస్వామ్య ప్రభుత్వంలో తమ వెతలు తీరతాయని భావించామని, గత ఎనిమిదేళ్ల నుంచి జీతాలు పెంచలేదని, తక్షణమే జీతాలు పెంచాలనే డిమాండ్‌తో శాంతియుత నిరసన చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యను పరిష్కరించడంలో అధికారులు తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. గత 5 రోజుల నుంచి నిరసన దీక్షలో ఉన్నా అధికారులకు చీమ కుట్టినట్లు లేదు. నిరసన దీక్ష చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల వద్దకు వచ్చిన డైరెక్టర్, రిజిస్ట్రార్ 'ఎలాగైనా ఛాన్సలర్‌తో సమావేశం ఏర్పాటు చేయిస్తాను' అనే మాటను నమ్మి అసిస్టెంట్ ప్రొఫెసర్లు మరోసారి మోసపోయారు. టెక్‌జైట్‌కి ముఖ్య అతిథిగా రావలసిన ఛాన్సలర్ అత్యవసర పనులను కారణంగా చూపి గైర్హాజరయ్యారు. 6వ రోజైన మంగళవారం కూడా అధ్యాపకులు తమ నిరసనను కొనసాగించారు. రోజంతా నిరసన కొనసాగిస్తున్న తమ జీవితాలతో ఉన్నతాధికారులు దోబూచులాడడం బాధాకరమని అసిస్టెంట్ ప్రొఫెసర్లు నినదించారు. ప్రస్తుత ప్రజాస్వామ్య ప్రభుత్వంలోనైనా వెతలు తీరతాయని భావించిన వారికి మరింత నిరాశ ఎదురైంది. ఆర్‌జియుకెటి ఉపకులపతిగా ఉన్న విజయ్ కుమార్ రెడ్డి ఇప్పటి వరకు క్యాంపస్‌లో అడుగుపెట్టింది లేదని, అన్ని ప్రోటోకాల్ సౌకర్యాలు అనుభవిస్తున్నారన్నారు. కానీ తమ సమస్య మీద న్యాయం చేయమని కోరితే మాత్రం 'నేను రిజైన్ ఇచ్చాను, నాకు సంబంధం లేదు' అని మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితితో తీవ్ర నిరాశతో ఉన్న మేము ప్లకార్డులతో ర్యాలీగా బయల్దేరి ఐ3 భవనంలో సెంట్రల్ పరిపాలనాధికారి బండి ప్రసాద్‌కు, పరిపాలనాధికారి లక్ష్మణరావుకు, అందుబాటులో ఉన్న ఇతర అధికారులకు వినతి పత్రాలు సమర్పించి, తమ గోడు వెళ్లబోసుకుని న్యాయం చేయమని అభ్యర్థించారు. ఎప్పుడూ తాళం వేసి ఉండే వీసి తలుపుకు వినతి పత్రాన్ని సమర్పించి నినాదాలిచ్చారు. మంగళవారం సాయంత్రం నుంచి ఐ3 భవనం ముందు ఉన్న రోడ్డు మీద టెంట్ వేయించి సమస్యకు పరిష్కారం లభించే వరకు నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలియజేశారు. ఆందోళనలో డాక్టర్ సీతాపతి, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ దుర్గాబాబు, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ చింతం నాయుడు, గణేష్ పాల్గొన్నారు.

నేవీ ఆయుధ డిపో వద్దంటూ రైతుల ధర్నా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

నేవీ ఆయుధ కర్మాగార డిపో ఏర్పాటుకు వ్యతిరేకంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. బోడిగూడెం పంచాయతీ పరిధిలో బర్కిట్‌నగర్ ప్రాంతంలో నేవీ డెక్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ వారు నినదించారు. ఒకప్పుడు బీడు భూములుగా ఉన్న తమ పొలాలు పోలవరం కుడికాల్వ వల్ల రెండు పంటలు పడుతున్నాయని, డిపో ఏర్పాటు వల్ల ఆ భూములు కోల్పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సేకరిస్తున్న 12 వందల ఎకరాల భూముల్లో నాలుగొందల ఎకరాలు సన్న, చిన్నకారు రైతులకు చెందినవేనన్నారు. కూరగాయల పంటలు పండిస్తూ బతుకుతున్న తాము భూములు కోల్పోతే కుటుంబాలతో సహా రోడ్డున పడతామని వాపోయారు. రైతులతో చర్చించకుండా, కనీసం గ్రామసభ నిర్వహించకుండా భూసేకరణ చేస్తున్నట్లు ప్రచారం దారుణమన్నారు. తాము భూములు ఇవ్వడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

నినదిస్తున్న రైతులు

7 గంటలకే మద్యం అమ్మకాలు ముగించాలి

ఎక్సైజ్ అధికారులకు ఐద్వా నేతల వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నూతన సంవత్సరం సందర్భంగా మద్యం అమ్మకాల వేళలను సవరించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి డిమాండ్ చేశారు. వారు మంగళవారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హైమావతి, శ్యామలారాణి మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఈ నెల 30 నుండి జనవరి ఒకటో తేదీ తెల్లవారుజాము వరకు మద్యం అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గత అనుభవాలు తెలిపాయన్నారు. యువత మద్యం అధికంగా సేవించి రోడ్లపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, మహిళలకు తీవ్ర ఇబ్బందులు కల్గిస్తున్నారన్నారు. రోడ్లపై ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతూ ఉన్నారని తెలిపారు. జనవరి ఒకటో తేదీ వరకు మద్యం అమ్మకాలను రాత్రి ఏడు గంటల వరకే జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆదాయం కోసం మద్యాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాన్ని నిలదీస్తేనే కొత్త సంవత్సరం మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతుందని అన్నారు. కోడిపందేల పేరుతో సంక్రాంతికి కాంతి లేకుండా చేస్తున్నాయని, వాటిని కూడా అరికట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వినతి అందిస్తున్న ఐద్వా నేతలు

వైద్య సేవలను విస్మరిస్తే సహించేది లేదు

వైద్యుల తీరుపై జిల్లా అధికారుల ఆగ్రహం

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శోభ హెచ్చరించారు. క్రిస్టమస్‌ను పురస్కరించుకొని జిల్లా అధికారుల అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా, పని వేళల్లో ఆసుపత్రి ఆవరణలో సౌండ్ సిస్టం టెంట్లు ఏర్పాటుచేసి సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. సెమీ క్రిస్మస్ వేడుకల్లో నిమగ్నమై రోగులను పట్టించుకోకపోవడంతో వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులు ఆసుపత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై రోగుల బంధువులు, స్థానికులు, బిజెపి నాయకులు పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారి అమృతం విచారణకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య శాఖ కార్యాలయ అధికారి శోభతో పాటు డాక్టర్ బాలు ప్రకాష్, డాక్టర్ నరేంద్రలతో కూడిన కమిటీ మంగళవారం పిహెచ్‌సి చేరుకుని వైద్యురాలు పవిత్రతో పాటు సిబ్బందిని విచారణ చేపట్టి, వివరాలను నమోదు చేసుకున్నారు. దీనిపై పవిత్రని అనుమతులు తీసుకున్నారా అని ప్రశ్నించగా అనుమతులు లేకుండానే చేయడం జరిగిందని చెప్పడంతో వైద్యురాలు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, అనుమతులు లేకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సౌండ్ సిస్టం టెంట్లు వేసి కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారు అంటూ నిలదీశారు. ఆస్పత్రిలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా ఉన్నతాధికారుల ఆదేశాలు తప్పనిసరిగా ఉండాలని, నిబంధనలను అతిక్రమిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించబోమని వైద్యురాలితో పాటు సిబ్బందితో లిఖితపూర్వకంగా హామీ పత్రాన్ని రాయించి తీసుకున్నారు. సేకరించిన సమగ్ర నివేదికను తదుపరి విచారణ నిమిత్తం కలెక్టర్‌కు, జిల్లా వైద్యాధికారులకు అందిస్తామని ఆమె తెలిపారు.

విచారిస్తున్న వైద్యాధికారులు

సమస్యల వెలికితీతలో 'ప్రజాశక్తి' కృషి అభినందనీయం

క్యాలెండర్ ఆవిష్కరణలో ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకురావడంలో ప్రజాశక్తి దినపత్రిక మహోన్నత పాత్ర పోషిస్తోందని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ప్రజాశక్తి 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రజాశక్తి పత్రిక సబ్జెక్టుపరంగా చదివేందుకు బాగుంటుందని కితాబిచ్చారు. సమస్యలను ప్రజాప్రతినిధులను దృష్టికి తీసుకొచ్చే విధానం బాగుంటుందని, సమస్య పరిష్కార మార్గాలు కూడా సూచిస్తుందని ప్రశంసించారు. ప్రజాశక్తి క్యాలెండర్ నాణ్యతలో ఎక్కడా రాజీ పడలేదని అభినందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు దేవ, చింతలపూడి పట్టణాధ్యక్షులు తాటి అప్పారావు, ఉర్లగూడెం సర్పంచి యువరాజు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్, ప్రముఖులు

పోలవరం జిల్లాలో పోలవరంను కలపాలి

సాధన సమితి ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్షలు

పోలవరం : పోలవరం నియోజకవర్గాన్ని కలుపుతూ పోలవరం జిల్లా కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ పోలవరం జిల్లా సాధన సమితి నాయకులు మంగళవారం పోలవరంలో స్థానిక సత్రం సమీపంలో నిరవధిక రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ దీక్ష శిబిరంలో పోలవరం జిల్లా సాధన సమితి నేతలు నాళం గాంధీ, బుగ్గా మురళీకృష్ణ, సొబ్బన మోహన్, జల్లేపల్లి వెంకట నరసింహారావు, కోటంరాజు రాంబాబు, కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, దొంతల వర్మ, తోలేటి రఘు, బొల్లంపల్లి ఏసయ్య, మొదటిరోజు రిలే నిరాహార దీక్ష శిబిరంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాలం గాంధీ, సొబ్బన రాజశేఖర్ బాబు మాట్లాడుతూ ఎన్నిల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు పోలవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. మూడు లక్షల మంది జనాభా ఉన్న పోలవరం నియోజకవర్గం అధిక శాతం గిరిజనులే ఉన్నారని, అంతేగాక పోలవరం నిర్మాణంలో ముంపు గ్రామాల నుండి పునరావాసాలకు, వేరే మండలాలకు తరలిపోవడం వల్ల వర్తక వాణిజ్య పరంగా, ఉద్యోగ ఉపాధుల పరంగా పోలవరం నియోజకవర్గం ఎంతో నష్టపోయిందన్నారు. జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడం, నియోజకవర్గాన్ని జిల్లాలో కలపడం వల్ల నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆశ పడిన ప్రజలకు రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోట్ పుండుమీద కారం చల్లినట్లయిందన్నారు. ఎన్నికల ముందు ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసారని, న్యాయం చేస్తానని హామీ ఇచ్చి సిఎం నేడు మాట తప్పి నియోజకవర్గ ప్రజలకు అన్యాయం చేయడం తగదన్నారు. భవిష్యత్తులో రెవెన్యూ డివిజన్ చేసి అభివృద్ధి చేస్తామంటూ చెబుతున్న కంటి తుడుపు చర్యలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలవరం జిల్లా ఏర్పాటు నిర్ణయంలో మార్పులు చేసి పోలవరం నియోజకవర్గాన్ని నూతన పోలవరం జిల్లాలో కలిపి పోలవరాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, లేని పక్షంలో నిరవధిక రిలే నిరాహార దీక్షలను ఆమరణ నిరాహార దీక్షలకు సైతం వెనకాడబోమని, ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరవధిక రిలే నిరాహార దీక్షల్లో నాయీబ్రాహ్మణ సంఘం సంఘీభావం తెలిపారు.

కొబ్బరికి మద్దతు ధర పెంచాలి

ఎపి కొబ్బరి రైతుల సంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొబ్బరికి 2026 సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పెంచిన కనీస మద్దతు ధర క్వింటాల్ మిల్లింగ్‌కు రూ.445, బంతి కొబ్బరికి రూ.400 కొబ్బరి రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదని, ఇది కంటి తుడుపు చర్య అని ఎపి కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. మంగళవారం స్థానిక అన్నే భవనంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొబ్బరి మద్దతు ధరపై ఆయన మీడియాతో మాట్లాడారు. మద్దతు ధర కోసం ఆందోళనలు చేస్తున్నా కొబ్బరి రైతుల గోడును కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ఈ ఏడాది సరాసరి ధర కొద్దిగా పెరిగినా కొబ్బరి రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రభుత్వ విదేశాల నుండి కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులకు అవకాశం కల్పించడం వల్ల దేశీయంగా కొబ్బరి రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రపంచ కొబ్బరి ఉత్పత్తిలో భారతదేశం మూడోస్థానంలో ఉండగా దేశంలో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉందని, కొబ్బరి ఉత్పాదకతలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్నా అనేక సంవత్సరాలుగా ఎర్రనల్లి, తెల్ల దోమ వంటి తెగుళ్ల వల్ల దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారని చెప్పారు. చెట్టు నుండి కొబ్బరికాయలు కోసి గుట్టగా పోయడానికి ఒక్కో కాయకు రైతుకు రూ.4కుపైగా ఖర్చవుతుందని వివరించారు. ఎకరాకు రూ.40 వేలకుపైగా పెట్టుబడి అవుతుందని తెలిపారు. మార్కెట్ మాయాజాలంతో కొబ్బరి రైతులు నలిగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్వింటాల్ మిల్లింగ్ కొబ్బరికి కనీస మద్దతు ధర రూ.15 వేలుగా, బంతి కొబ్బరికి రూ.18 వేలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కొబ్బరి పంట ఉన్న జిల్లాల్లో కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల నుండి నేరుగా కొబ్బరికాయలనే కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని కోరారు. కొబ్బరి కనీస మద్దతు ధర పెంచకపోతే కొబ్బరి రైతులు ఐక్యంగా ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పదండి.. పదండి.. విశాఖ వెళ్లొద్దాం

ముమ్మరంగా సిఐటియు మహాసభ ప్రచారం

చింతలపూడిలో..

కొయ్యలగూడెంలో..

ప్రజాశక్తి - చింతలపూడి

జనవరి 4న చలో విశాఖ జయప్రదం చేయాలని అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చలో విశాఖ పోస్టర్లు, బ్యానర్లు చేతబూని నినదించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి జి.సరళాదేవి మాట్లాడగా వి.శ్యామల, డి.హేమలత, ఎం.అరుణకుమారి, చెన్నకేశ్వరి, జ్యోతి, అరుణ, ఎలీసమ్మ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: జనవరి 4న విశాఖపట్నంలో జరిగే సిఐటియు బహిరంగ సభను జయప్రదం చేయాలని మండలంలోని స్కీమ్ వర్కర్లందరూ తరలి వెళ్లాలని సిఐటియు మండల కన్వీనర్ చిట్టిబొమ్మ కొండలరావు కోరారు. మండల అధ్యక్షురాలు ఉర్ల నాగమణి మాట్లాడగా జ్యోతి, అరుణ, భూలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బయ్యన్నగూడెం సెక్టార్ ఆధ్వర్యంలో సిఐటియు మహాసభ సందర్భంగా స్థానిక అంగన్వాడీ స్కూలు నుండి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడారు. కార్యక్రమంలో పి.లక్ష్మి, ఎస్‌కె.మస్తాన్, బి.మోహిని, నాగమణి, సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్: శివకాశిపురంలో అంగన్వాడీ సెక్టార్ సమావేశం నిర్వహించి 4న అంతా విశాఖ తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎస్.లత, బోగరి వెంకన్న పాల్గొన్నారు.

ముదినేపల్లి: సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. జనవరి 4న జరగనున్న ప్రదర్శన బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ముదినేపల్లి, సింగరాయపాలెం గ్రామాల్లో, గ్రోవెల్ ఫ్యాక్టరీ వద్ద కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బస్సా రామనాగేంద్రరావు, పతివాడ పెద్దిరాజు, దాకారపు నాగేశ్వరరావు, యర్రంశెట్టి ప్రసాద్, జంగం బాలు, పెరుమాళ్ల అమ్ములు, గొర్రె వెంకన్న, పరసా నాగబాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్‌లో..

ముదినేపల్లిలో..

జంగారెడ్డిగూడెంలో..

విఆర్ఒలకు ఉద్యోగోన్నతిపై హర్షం

కలెక్టర్, జెసి, డిఆర్ఒను కలిసిన నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 16 మంది గ్రేడ్-1 విఆర్ఒలకు సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లు కల్పించినందుకు, 36 మంది గ్రేడ్-2 విఆర్ఒలకు ప్రొబేషన్ డిక్లేర్ చేసినందుకు ఎపి విఆర్ఒల సంఘం నేతలు కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి అభిషేక్‌గౌడ్, డిఆర్ఒ విశ్వేశ్వరరావును స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు మాట్లాడుతూ విఆర్ఒల సమస్యలు పరిష్కరించేందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సీనియర్ అసిస్టెంట్ పోస్టులు చాలా ఖాళీలు ఉన్నందున పరిపాలనా సౌలభ్యం కోసం సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఆడహాక్ పద్ధతిలో అర్హులైన విఆర్ఒలతో భర్తీ చేయాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, ఏలూరు జిల్లా అధ్యక్షులు కాయల వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి రవికుమార్, నాయకులు అజయ్ పాల్గొన్నారు.

అధ్వానంగా పొంగుటూరు-కన్నాయగూడెం రహదారి

దుమ్ము, ధూళితో ప్రమాదాలబారిన ప్రజలు

గుంతలు, గతుకులతో అవస్థలు

రహదారి నిర్మించాలని వేడుకోలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పొంగుటూరు పంచాయతీ పరిధిలోని పొంగుటూరు-కన్నాయగూడెం గ్రామాల మధ్య సుమారు 2 కిలోమీటర్ల రహదారి పూర్తిగా దుమ్ము, ధూళితో నిండిపోయి ప్రమాదాలకు గురిచేస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు సంవత్సరాలుగా ఈ రహదారి గుంతలు, గతుకులతో తీవ్రంగా దెబ్బతిందని గ్రామస్తులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, పాలకులు పలుమార్లు నిధులు మంజూరు అయ్యాయని చెప్పినా... వాస్తవంగా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కోటి రూపాయలతో రహదారి నిర్మిస్తామని ప్రకటించినా, అమలు మాత్రం ఇప్పటికీ ప్రారంభం కాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక మరో ప్రధాన సమస్యగా గ్రీన్‌ఫీల్డ్ కు చెందిన లారీలు గత రెండు సంవత్సరాలుగా ఇదే రహదారిపై 100 టన్నుల మెటీరియల్‌తో తిరగడం వల్ల రహదారి పూర్తిగా అస్తవ్యస్తంగా మారిపోయిందని గ్రామస్తులు తెలిపారు. ఆరోగ్యపరంగా కూడా అనేక పరిణామాలు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ఉన్నత స్థానంలో ఉన్న ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నా లాభం లేదని ఆక్రోశం వ్యక్త పరుస్తున్నారు. ఈ పరిస్థితిపై కలెక్టర్ స్థాయిలో అధికారులు వెంటనే స్పందించి, రహదారి సమస్యను పరిష్కరించాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దుమ్ముతో దారి కనపడని దుస్థితిలో రహదారి

విద్యార్థుల సృజనాత్మకత

బొకే తయారీ చేస్తున్న విద్యార్థి

తక్కువ ధరలకు పూల బొకేలు తయారీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయుటకు అతి తక్కువ ధరలలో పూల బొకేలు తయారుచేస్తున్నారు. ఈ కళాశాల ప్రిన్సిపల్ అపర్ణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ పూల బొకేలపై ఆసక్తి ఉన్నవారు ముందుగానే ఆర్డర్ చేసుకోవాలని అన్నారు. ఇవి పట్టణంలోని బస్టాండ్, పెద్ద గాంధీ బొమ్మ సెంటర్లో ఒకటో తేదీ ఉదయం ఏడు గంటల నుండి అందుబాటులో ఉంటాయని అన్నారు. ఆర్డర్ కోసం ఫోన్ నెంబర్ 8790276583 సంప్రదించాలన్నారు.

హోం గార్డ్ కుమారుడు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు

అభినందించిన ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

చింతలపూడి : హోం గార్డ్ కుటుంబం నుండి వచ్చిన బాలుడు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. పోలీస్ శాఖకు చెందిన హోం గార్డ్ కుమారుడు కె.సాయి దీపక్ క్రీడా రంగంలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని యర్రంపల్లి గ్రామానికి చెందిన పోలీస్ విభాగంలో హోం గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సూరిబాబు కుమారుడు కె.సాయి దీపక్ అండర్-14 ఆంధ్రప్రదేశ్ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన సాయి దీపక్ ప్రతిభను కొనియాడుతూ హోం గార్డ్ కుటుంబం నుంచి వచ్చి ఈ స్థాయికి ఎదగడం ... పోలీస్ కుటుంబాల్లోని పిల్లలు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించడం చాలా సంతోషాయకమన్నారు. సాయి దీపక్ భవిష్యత్తులో మరింత కష్టపడి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని, భారత జట్టులో స్థానం సంపాదించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. హోం గార్డ్ సూరిబాబు తన కుమారుడి ప్రతిభను గుర్తించి, ప్రోత్సాహించి నందుకు ఎస్‌పి అభినందించారు. కార్యక్రమంలో అదిస్ పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

టి.నరసాపురం: మండలంలోని మక్కినవారిగూడెం సహకార సంఘం ఆధ్వర్యాన ముద్రించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘ ఛైర్మన్ ఉదంత సూర్యనారాయణ, వర్సస్సు సత్యనారాయణ, దాసరి వెంకటలక్ష్మి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ సేవలు రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ యుడివి.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి : ఎంఇఒ

కొయ్యలగూడెం : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేసి, విద్యార్థులందరూ మెరుగైన గ్రేడ్లతో పాస్ అయ్యేలా కృషి చేయాల్సిందిగా ఎంఇఒలు జె.సురేష్ బాబు, సిహెచ్.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం పొంగుటూరులోని మండల విద్యా వనరుల కేంద్రంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణతలో మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఎపిటిఎఫ్ క్యాలెండర్ను, డైరీలను అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డి దొర, మండల ప్రధాన కార్యదర్శి ఎ.దయ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు జెఎస్.శాస్త్రి, మండల సబ్ కమిటీ సభ్యులు కె.శ్యాంబాబు, ఎల్.గురవారావు, బి.వెంకటేశ్వరరావు, ఎస్.రమేష్, పి.వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి : ఎంఇఒ

ముసునూరు: పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినప్పుడే ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగావకాశాలు పొందవచ్చునని మండల విద్యాశాఖ అధికారి బివిఎస్.సుబ్బారావు అన్నారు. మంగళవారం గురుకుల బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులకు బోధించు ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రిన్సిపల్ కె.లక్ష్మి కుమారి ఉన్నారు.

లింక్ రోడ్డుకు నిధులు మంజూరు

ముసునూరు : మండల పరిధిలోని చిల్లబోయినపల్లి గ్రామం నుండి మడివర్ల గ్రామానికి నిత్యం రైతులు, విద్యార్థులు అనేకమంది ప్రయాణం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంతకు రోడ్డు బాగోక అనేక ఏళ్లుగా లింక్ రోడ్డు కోరుతూ గత ప్రభుత్వంలో అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యను స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ... రోడ్డు కోసం నిధులు మంజూరు చేశారు. 85 లక్షలు ... తెలిపారు. టిడిపి నేత మొక్కపాటి ఉమామహేశ్వరరావు, టిడిపి గ్రామ అధ్యక్షుడు కందెపు రామగిరి, బొల్లినేని సుబ్బయ్య, జనసేన నాయకులు బల్లా వీరస్వామి, పామర్తి నాగు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గోదావరిలో పడిన ప్రాజెక్టు డంపర్

తృటిలో తప్పిన ప్రమాదం

పోలవరం : ప్రాజెక్టు మట్టి రాయి తరలించే డంపర్ గోదావరిలోకి పడిపోయిన సంఘటనలో ప్రమాదం తృటిలో తప్పిన సంఘటన మంగళవారం పోలవరం ప్రాజెక్టులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పోలవరం ప్రాజెక్టు దిగువ కాఫర్ డ్యాంకి 902 హిల్ ప్రాంతం నుండి రాయి మట్టి తరలించడానికి వాహనాల రాకపోకలు సాగించేందుకు స్పిల్ ఛానల్‌లో నీటి ప్రవాహానికి అడ్డంగా ప్రధాన రహదారి ... ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్ ... అప్రమత్తమై బయటకు దూకి స్వల్ప గాయాలతో ప్రాణాలు కాపాడుకున్నారు. గాయపడిన వారిని ప్రాజెక్టు ఆసుపత్రిలో చికిత్స ... క్రేన్ సహాయంతో బయటకు వెలికి తీశారు.

కొనసాగిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

నూజివీడు టౌన్: రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జియుకెటి), నూజివీడు ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నాలుగవ రోజు కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. ... విద్యార్థులు గ్రామ పరిశుభ్రత, సమాజానికి ఉపయోగకరంగా, విజయవంతంగా కొనసాగాయి. ... ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ... విద్యార్థులు పాల్గొన్నారు. ... ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవాభావాన్ని, బాధ్యతాయుత పౌరసత్వాన్ని ప్రదర్శించారు.

టిడిపి కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేత

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్



ప్రశంసా పత్రాలు అందిస్తున్న బ్రికార్ ప్రైవేట్ బోరంలు

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పై టిడిపి యాప్‌లో చురుకైన కార్యకర్తలుగా లోకేష్ టీమ్ తరఫున పనిచేసినందుకు సేవ స్ఫూర్తి - నిస్వార్థ సేవకు గౌరవం మంగళవారం ... ప్రశంసా పత్రాలు అందజేశారు. ... అనంతరం ... ప్రశంసా పత్రాలు అందుకున్న కార్యకర్తలు ... తెలియజేశారు.

ప్రజాశక్తి పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈకింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆర్ఒ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రారంభిస్తున్న సర్పంచి

పోలవరం : కొత్త పట్టిసీమ గ్రామ పంచాయతీలో సర్పంచి మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యాన మైగాపుల కొండలరావు జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన, శుద్ధి చేసిన తాగునీటి సరఫరా(ఆర్ఒ ప్లాంట్)ను పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ ఆర్ఒ ప్లాంట్‌ను కొండలరావు కుమారులు మైగాపుల దుర్గాప్రసాద్, మైగాపుల శ్రీనివాస్ సహకారంతో గ్రామ ప్రజల కోసం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి సుంకర వెంకట రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీటి అందించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించడంలో ఎంతో తాగునీటి సరఫరా తప్పనిసరి అని అన్నారు. మైగాపుల కొండలరావు జ్ఞాపకార్థంగా ఈ ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని, ఇది గ్రామస్తులకు శాశ్వత ఉపయోగం చేకూరుస్తుందని చెప్పారు. అనంతరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, పూడి వెంకట్రావు, వలవల వరలక్ష్మిలను పూలదండలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వలవల వరలక్ష్మి, కొత్తపట్టిసీమ సొసైటీ మాజీ అధ్యక్షులు పూడి వెంకట్రావు, ఉప సర్పంచి రంభ శ్రీనివాస్, గూటాల మాజీ సర్పంచి రొంగల సుబ్బారావు, కొత్తపట్టిసీమ సొసైటీ మాజీ అధ్యక్షులు అడ్డగర్ల సాయిబాబా, పంచాయితీ కార్యదర్శి కోట ప్రసాద్, పంచాయతీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ

ఎపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఉపాధ్యాయుల శ్రేయస్సుకు ఎపిటిఎఫ్ ఎప్పుడూ కృషి చేస్తుందని ఆ శాఖ సీనియర్ నాయకులు బేతాళ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. మంగళవారం ముదినేపల్లిలో మండల అధ్యక్షులు కృపాకర్ ఆధ్వర్యాన 2026 సంవత్సరానికి సంబంధించిన మండల క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ముదినేపల్లి ఎస్ఐ విఎస్.వీరభద్రరావు మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, తమ వంతు సహకారం ఎప్పుడూ అందిస్తామన్నారు. అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి, ప్రముఖ వైద్యులు మనోజ్, ఉపాధ్యాయులు జాన్సన్, వెంకట రత్నం, చక్రధర్ పాల్గొన్నారు.

నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించాలి

రోడ్లపైనే రిజిస్ట్రేషన్లు షురూ

కక్షిదారులు, సాక్షులకు వేచి ఉండే స్థానం కరువు

మహిళల అవస్థలు వర్ణణాతీతం

దస్తావేజు లేఖరి రామ్మోహన్ రాజు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తక్షణమే సౌకర్యవంతమైన మరొక ప్రాంతానికి తరలించాలని దస్తావేజు లేఖరి రామ్మోహన్ రాజు కోరారు. పట్టణంలో ఆయన మాట్లాడుతూ తాను 20 ఏళ్లుగా దస్తావేజు లేఖరిగా విధులు నిర్వర్తిస్తూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నానన్నారు. ఏ మాత్రం సౌకర్యాలు లేకుండా కార్యాలయాన్ని అద్దె భవనంలో కొనసాగించడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు, మార్ట్ గేజ్ లావాదేవీలకు సంబంధించి రైతులు, ఆయా స్థిరాస్తుల యజమానులు, సాక్షులు ఎన్నో ఇబ్బందులకు గురి అవుతున్నట్లు వివరించారు. లావాదేవీలకు సంబంధించి భూ యజమానులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా తప్పనిసరిగా హాజరు కావలసిన సాక్షులు వేచి ఉండేందుకు స్థానం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు లేకపోవడం వల్ల ఎక్కువ సమయం వేచి ఉండేందుకు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళల అవస్థలు వర్ణణాతీతమని, ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఏ ఒక్క అధికారి స్పందించలేదన్నారు. కార్యాలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించినా, నిర్మాణం వైపు అడుగులు వేయకుండా, అద్దె భవనంలో దశాబ్దాల తరబడి కొనసాగించడం వెనుక అసలు కథ ఏమిటో ఈ ప్రాంతంలో ఎవరిని అడిగినా చెబుతారని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా అధికారులు సకాలంలో స్పందించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అన్ని సౌకర్యాలు ఉన్న సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని కోరారు.

డివైఎఫ్ఐ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌డిఒ ఎంవి.రమణ

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ) ఆధ్వర్యాన రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు ఎన్.రాజేష్ అధ్యక్షత వహించారు. క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం ఆర్‌డిఒ మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి సమృద్ధిని అందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. క్యాలెండర్ ద్వారా ప్రజలకు ఉపయోగకరమైన సమాచారం, సామాజిక బాధ్యతా భావం పెంపొందుతుందన్నారు. యువత సమాజాభివృద్ధిలో చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఎప్పటికీ యువత, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ సమాజహిత కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. నూతన సంవత్సరంలో యువతను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లే దిశగా డివైఎఫ్ఐ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ డివైఎఫ్ఐ నాయకులు ఎ.రవి, ఎం.జీవరత్నం, కె.భాస్కర్, నాగేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు

యుటిఎఫ్ 2026 డైరీ, క్యాలెండర్, వాల్ స్టిక్కర్లను మంగళవారం స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఎంఇఒ 1, 2 ఎ.రవి ప్రకాష్, అరుణ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ శాతం పెరగడానికి యుటిఎఫ్ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఎల్.కనకదుర్గ, ఎస్‌కెవిఎస్.మణి, మండల నాయకులు ఎస్‌కె.పూరా ఖాన్, కె.నాగేశ్వరరావు, టిఇఎన్‌డి.ప్రసాద్, సత్యవాణి పాల్గొన్నారు.

పలుచోట్ల పొలం పిలుస్తోంది

ద్వారకాతిరుమలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి చెన్నకేశవులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని ఐఎస్ రాఘవాపురం, జి.కొత్తపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎస్.చెన్నకేశవులు మాట్లాడుతూ రైతులకు మండలంలో ఎటువంటి యూరియా కొరత లేదని సూచించారు. మండలంలో 11 సొసైటీల్లో 310 టన్నుల యూరియా, వివిధ ప్రయివేట్ దుకాణాల్లో 90 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలియజేశారు. రైతులు యూరియాని అవసరం మేరకే వాడాలని, అధికంగా వాడితే పురుగులు, తెగుళ్ల ఆశిస్తాయని సూచించారు. మండలంలో మొక్కజొన్న 1700 ఎకరాల్లో ఇప్పటి వరకు వేయడమైనదని, వరి పంట దాదాపుగా 1600 ఎకరాల్లో సంక్రాంతి లోపలే సాగు చేయడం జరుగుతుందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి అమర్నాథ్, ఉద్యాన పంటలలో ఎరువుల యజమాన్యం, వివిధ పథకాల గురించి వివరించారు. ఝాన్సీ, ఆదిత్య, రైతులు పాల్గొన్నారు.

ముసునూరు : మొక్కజొన్న పంటలో రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి, సేంద్రియ పద్ధతిలో ఎరువులు వాడినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చునని, తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభం పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అక్కిరెడ్డిగూడెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా 30 రోజులు దాటిన తర్వాత పంట చేలో కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని, రైతులు దిగుబడులు ఎక్కువగా సాధించాలంటే పంట మార్పిడి విధానం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పులిబళ్ల లక్ష్మీ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

ముసునూరులో..

నకిలీ క్యాస్ట్రాల్ ఆయిల్ గ్యాంగ్ గుట్టురట్టు!

ముదినేపల్లి: నకిలీల గొడవ ఎక్కువైంది. పాలు బాగా కల్తీ అవుతున్నాయి. వివిధ పేర్లతో నకిలీ గ్యాంగ్‌లు హల్ చల్ చేస్తున్నాయి. నెయ్యి, గుట్కాలు, బిస్కెట్లు, కారం, పసుపు.. ఇలా కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్టుగా కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. తాజాగా ఇంజన్ ఆయిల్ విషయంలోనూ మనం అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం ఇది. మీకు టూ వీలర్ వుందా.. మీ బండిలో వేసే ఇంజన్ ఆయిల్ ఒరిజనల్ అవునా కాదో అని చెక్ చేసుకోవాలి. మండల కేంద్రమైన ముదినేపల్లిలో నకిలీ ఇంజన్ ఆయిల్ తయారీ గుట్టుగా సాగిపోతోంది. నకిలీ క్యాస్ట్రాల్ ఆయిల్ తయారు చేస్తున్న ఇంటిపై ముదినేపల్లి పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ముదినేపల్లి గ్రామానికి చెందిన కెవి.సురేష్ నివాస గృహాన్ని తనిఖీ చేయగా అతడు పి.నరేంద్రతో కలిసి వివిధ ప్రసిద్ధ కంపెనీల పేర్లతో నకిలీ ఇంజిన్ ఆయిల్స్, నకిలీ బిఎస్-6ను అక్రమంగా తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. టిన్ కాప్ సీలింగ్ మెషిన్, తూకం యంత్రం, వివిధ ఆయిల్ కంపెనీల లేబుల్స్, వివిధ పరిమాణాల ఖాళీ టిన్లు, మూతలు, కొలిచే జార్లు, రంగు రసాయన ద్రవాలు, కంపెనీ బ్రాండ్ కార్డ్‌బోర్డ్ బాక్సులు, యూరియా సంచులు, యూరియాతో కలిపిన నీటి డ్రమ్ములు(బిఎస్-6 అడ్బ్లూ తయారీకి), ఉపయోగించిన ఇంజిన్ ఆయిల్ - 200 లీటర్లు ఐ 4 డ్రమ్ములు, వస్తువులు ఉపయోగించి నిందితులు క్యాస్ట్రోల్, బజాజ్, సర్వో, జెసిబి ఇంజిన్ ఆయిల్, జెసిబి హైడ్రాలిక్ ఆయిల్ వంటి నకిలీ ఇంజిన్ ఆయిల్స్ భారత్ బెంజ్, టాటా మోటార్స్, ఐషర్ పేర్లతో నకిలీ యాడ్ బ్లూను తయారు చేసి మోటర్ మెకానికులకు సరఫరా చేస్తూ ప్రజలను మోసం చేస్తూ వాహనాలకు, పర్యావరణానికి నష్టం కలిగిస్తున్నారని తేలిందని ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు. ఎఎస్ఐ ఆకుల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పోలీసు శాఖ లీడర్ గోపాలకృష్ణ మృతి

ఏలూరు స్పోర్ట్స్ : ఏలూరు జిల్లా పోలీసు శాఖకు లీడర్‌గా పనిచేస్తున్న కె.గోపాలకృష్ణ ఆకస్మికంగా మృతిచెందారు. సంబంధిత వివరాల ప్రకారం పోలీసు జిల్లా విభాగానికి గత కొన్నేళ్లుగా కె.గోపాలకృష్ణ లీగల్ అడ్వైజర్‌గా పని చేస్తున్నారు. ఆయన స్వస్థలం భీమవరం కాగా భీమవరం నుండి ఏలూరు వచ్చి విధులు నిర్వహిస్తూ ఉంటారు. ఈ క్రమంలో మంగళవారం ఆయన గుండెపోటుతో భీమవరంలో స్వగృహంలో మృతిచెందారు. ఆయన మృతి పట్ల జిల్లా పోలీసు అధికారులు, పోలీసు అసోసియేషన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.

ఉద్దేశపూర్వక ఘటనలపై ఫిర్యాదు చేస్తాం

గాలాయగూడెం గ్రామ ఘటనపై పంచాయతీ అధికారులు

దెందులూరు: మండలంలోని గాలాయగూడెం గ్రామంలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రాల వద్ద ఉన్న బోర్డులలో గల ప్రజాప్రతినిధుల ఫొటోలపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అనుచితంగా ప్రవర్తించిన నేపథ్యంలో స్థానిక పంచాయతీ, సచివాలయం సిబ్బంది వాటిని శుభ్రం చేశారు. అయితే ప్రజలకు సేవలు అందించే ప్రజా ప్రతినిధుల ఫొటోల పట్ల కొందరు అవమానకర రీతిలో ప్రవర్తించటం ఎంతో బాధాకరమని, ప్రజా సేవే లక్ష్యంగా పనిచేసే ప్రభుత్వ అధికారులు, సిబ్బంది మనో స్థైర్యాన్ని ఇబ్బంది పెట్టే విధంగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇలా ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ విధంగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద, గ్రామాల్లో అనుచితంగా ప్రవర్తించటం, లేని సమస్యలు ఉన్నట్టు సృష్టించటం విచారకరమని, ఇటువంటి ఘటనలను ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకు వెళ్తామని స్థానిక పంచాయితీ కార్యదర్శి ఉషా రాణి తెలిపారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే గ్రామాల్లో కూటమి నాయకుల ఫ్లెక్సీలను చించటం, అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల బోర్డుల వద్ద అనుచిత పనులకు పాల్పడడం చేస్తున్నారని, ప్రశాంత గ్రామాల్లో మనస్పర్థలు సృష్టించి, విభేదాలు సృష్టించాలని కుట్రలు చేస్తే వారిని ఉపేక్షించబోమని, వారిపై పోలీస్ శాఖ అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్తామని స్థానిక కూటమి నాయకులు తెలిపారు.

CHANGE OF NAME
I, NAMBURI USHA RAJAKUMARI (Old name) W/o. N.E. BABU, Resident of Flat no G-4, Sohini Towers, Katta Subbarao Street, Ramachandrarao pet, Eluru, Eluru district, A. P. I have changed my name as PIDAKALA USHA RAJAKUMARI (New name) W/o. N.E.Babu Hereafter my name is known as PIDAKALA USHA RAJAKUMARI (New name) W/o.N.E.Babu.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు : ఎస్ఐ

జీలుగుమిల్లి : నూతన సంవత్సర వేడుకల పేరుతో ఈనెల 31 రాత్రి అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ క్రాంతి కుమార్ హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.వేడుకల పేరుతో 31 రాత్రి మద్యం సేవించి అల్లర్లు సృష్టించిన, ద్విచక్ర వాహనాలపై అతి వేగంగా వెళ్తూ సైలెన్సర్‌లు తొలగించి అధిక శబ్దాలు చేసిన, గుంపు గుంపులుగా చేరిన, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా ఆహ్లాదకరంగా జరుపుకోవాలని సూచించారు.

మిర్చి తోటల పరిశీలన

ముసునూరు: మిర్చి పంటలో నల్లి, తామర పురుగు నివారణకు క్రిమిసంహారక మందులే కాకుండా ప్రకృతి, సేంద్రియ పద్ధతులు పాటించి నివారించ వచ్చునని వైఎస్ఆర్ ఉద్యానవన శాఖ కార్యాలయ అధికారిని పి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని వలసపల్లి, గుడిపాడు, గుల్లపూడి గ్రామాల్లో సాగులో ఉన్న మిర్చి తోటలను మండల ఉద్యానవన శాఖ అధికారి ఆర్.హేమ ఆధ్వర్యాన ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ బెంగళూరు వారి లింగాకర్షణ అట్టలను పంట చేలో ఎకరానికి 10 నుంచి 15 అట్టలు ఉంచినట్లయితే కొంత శాతం నివారించవచ్చునని, అలాగే పంటలో క్రిమిసంహారక మందులు వెంట వెంటనే కాకుండా వారం విడిచి వారంలో పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు మేదరమెట్ల సురేంద్ర, సర్పంచి చలసాని దామోదరరావు, రైతులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు బొలెరో వాహనం అందజేత

జంగారెడ్డిగూడెం: డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు తన పుట్టినరోజు సందర్భంగా జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌కు తన సొంత నిధులతో బొలెరో వాహనాన్ని అందజేశారు. ప్రజల భద్రతకు, పోలీసు శాఖకు తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో ఈ వాహనాన్ని అందజేయడం విశేషం. ఈ సందర్భంగా రాంబాబుకు శుభాకాంక్షలు తెలియజేయడానికి భారీ సంఖ్యలో అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. పుట్టినరోజు సందర్భంగా అందరికీ విందు ఏర్పాటు చేసి, ఆత్మీయంగా కలుసుకున్నారు. సామాజిక సేవలో ముందుండే కరాటం రాంబాబు చర్యను పలువురు అభినందించారు.

ముగిసిన 'టెక్ జైట్ 25' 2.0

నూజివీడు టౌన్: 'టెక్‌జైట్ 25' 2.0 కార్యక్రమం మొదటి రోజు అద్భుత విజయంతో సాగి రెండవ రోజు కూడా అత్యంత వైభవంగా నిర్వహించబడి ముగిసింది. శాస్త్ర విజ్ఞానానికి కేంద్రబిందువుగా నిలిచిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందిస్తూ, ఆలోచనలను ఆచరణలోకి తీసుకువచ్చే వేదికగా నిలిచింది. విజ్ఞానం, సృజనాత్మకత, నైపుణ్యాల సమ్మేళనంగా ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. క్వాంటం టెక్నాలజీపై పెరుగుతున్న అవగాహన, ఆధునిక పరిశ్రమలపై దాని ప్రభావం, మానవ మనుగడలో దాని కీలక పాత్ర వంటి అంశాలను నిపుణులు సవివరంగా వివరించారు. ఈ చర్చలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృష్టిని మరింత బలోపేతం చేసి, భవిష్యత్ సాంకేతిక అభివృద్ధికి అవసరమైన ఆలోచనలకు దారితీశాయి. నేటి తరం శాస్త్ర సాంకేతిక రంగంలో పోషించాల్సిన పాత్రను స్పష్టంగా తెలియజేస్తూ, రేపటి సమాజాన్ని మార్చేది అదే యువత ఆలోచనలేనని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. టెక్‌జైట్ 25' 2.0 రెండవ రోజు భాగంగా నిర్వహించిన మెగా ఎక్స్‌పో కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా జ్ఞాన్ ఎల్లా(ఫౌండర్ సిటిఒ - ఐక్యూ లీప్ రీసెర్చ్), రామ్ చింతలపూడి(గ్లోబల్ స్ట్రాటజిస్ట్) పాల్గొన్నారు. విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టులు, చిన్న తరహా శాస్త్రీయ మోడల్స్ విద్యార్థులను ఆకట్టుకున్నాయి. సమాజ సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను సూచించే ఈ ప్రదర్శనలు విద్యార్థుల ఆలోచనా శక్తిని ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమంలో శాస్త్ర విజ్ఞానం, సాంకేతికతలే దేశ అభివృద్ధికి పునాదులని ఈ టెక్ జైట్ నిరూపించింది. ఈ కార్యక్రమాన్ని ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్, పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.చిరంజీవి పర్యవేక్షించారు.

ముక్కోటి ఏకాదశికి పోటెత్తిన యాత్రికులు

ఉంగుటూరు: వైకుంఠ ఏకాదశి(ముక్కోటి) సందర్భంగా నారాయణపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు తెల్లవారు జామునుంచే పోటెత్తారు. భక్తులకు శంఖు తీర్థం వితరణ చేయడం ఇక్కడి ఆలయ విశిష్టత. రాష్ట్రంలో మంగళగిరి తరువాత శంఖు తీర్థం వితరణ ఈ ఆలయంలో ప్రత్యేక పొందిందని అర్చకులు అయ్యప్ప వెల్లడించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దస్తావేజు పడిపోయినవి

పాలకొల్లు పట్టణ కాపురస్తులు కంకిపాటి ప్రణీత, భర్త: అగ్రి సందీప్, డోర్ నెంబర్ 24-5-12, శిద్దుల గూడెం, శంభుని పేట ఇచ్చిన పత్రిక ప్రకటన ఏమనగా నా తాలూకు సొంత భూమి సర్వే నెంబర్ - 249, ప్లాట్ నెంబర్ 856, టిఎల్పి నెంబర్ - 25/2017/Hలోని 225 చ.గజాలు, శిల్పా బృందావన్, రంజోళి గ్రామం, జహీరాబాద్ మండలం, సంగారెడ్డి జిల్లా తెలంగాణలో ఉంది. ఇది రిజిస్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెంబర్ 4014/2020, జహీరాబాద్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో నా పేరున రిజిస్టర్ అయి ఉంది. ఈ మధ్యన నేను పాలకొల్లు నుండి విజయవాడ బదిలీ అయ్యాను. నా ఒరిజినల్ దస్తావేజులు పాలకొల్లు లోని మా నాన్నగారు ఇంటివద్ద ఉంచగా ది 2-12-2025న వారు మరో ఇంటికి మారుతుండగా నా ఒరిజినల్ దస్తావేజులు కనిపించడం లేదు. వీటి కోసం ఎంత వెతికినా నా ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెంబర్ 4014/2020 దస్తావేజు దొరకలేదు. ఇవి ఎవరికైనా దొరికిన ఈ కింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు. సెల్ 9908403828

మునిసిపల్ ఆఫీస్, పాలకొల్లు

ఆర్.ఓ.సి.నెం.769/2025/ఇ1 తేది.30-12-2025

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలో గల 29వ వార్డులోని సమత మహిళా భవన్ (ప్లాస్టరింగ్ పనులు, తలుపులు మరియు కిటికీల భర్తీ, పెయింటింగ్, షెడ్ పనులు, మరుగుదొడ్లు మొదలైనవి) మరమ్మతులు & పునరుద్ధరణ మరియు సచివాలయానికి కంప్యూటర్లు, ప్రింటర్లు మరియు యుపిఎస్ ఏర్పాటు చేయుటకు పురపాలక సంఘ సాధారణ నిధుల నుండి చేపట్టుటకు గాను 2-పనులకు అంచనాలు విలువ సుమారు రూ.44,95,000/- లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండరు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది.31-12-2025వ తేది సాయంత్రం గం.04.00 ని.ల నుండి లభించును.

బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేదీ	: 31-12-2025 సాయంత్రం గం.04.00 ని.లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ ముగింపు తేది	: 19-01-2025 సాయంత్రం గం.3.00 ని.లకు
పైన బిడ్ తెరుచు తేది	: 19-01-2025 సాయంత్రం గం.03.30 ని.లకు

మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెటు www.tender.apreprocurement.gov.in లేదా కమీషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- కమీషనరు, పాలకొల్లు పురపాలక సంఘం.